

ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి





# ముగ్గులోలికే..

## ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న యువతులు, మహిళలు
- సంస్కృతి, సంప్రదాయానికి అద్దం పట్టేలా రంగవల్లులు
- ముఖ్యఅతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి, జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మహిళా సీఐ



మొదటి బహుమతి సాధించిన ముగ్గు - విజేత లత

సిద్దిపేటటౌన్, జనవరి6: ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గులు, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగుళూరు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, సహస్ర హైస్కూల్ సౌజన్యంతో సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు సంస్కృతీ సంప్రదాయానికి అద్దం పట్టేలా ముగ్గులు వేశారు. పోటీల్లో 10 ఏళ్ల బాలిక నుంచి 70 ఏళ్ల వృద్ధురాలి వరకు నువ్వా, నేనా అన్నట్లుగా ముగ్గులు వేశారు.



ముగ్గులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

### విజేతలు వీరే..

ప్రథమ విజేతగా లత (రూ.6వేలు), ద్వితీయ విజేతగా రేణుక (రూ.4 వేలు), తృతీయ విజేతగా రజిత (రూ. 3వేలు) నిలిచారు. సాయిప్రియ, హరిణి, వీరమణిలు కన్సోలేషన్ బహుమతులను గెలుచుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సహస్ర పాఠశాల యాజమాన్యం వారు బహుమతులను అందజేశారు.

### బహుమతులు అందజేత

విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథులు సీనియర్ సివిల్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు, సహస్ర హైస్కూల్ చైర్మన్ దరిపల్లి చంద్రం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సహస్ర పాఠశాల చైర్మన్ దరిపల్లి చంద్రం, కరస్పాండెంట్ శ్రవణ్ దామెర, డైరెక్టర్ హారిక, ప్రిన్సిపాల్ శాంతికిరణ్, ఆంధ్రజ్యోతి ప్రతినిధులు అరుణ్‌కుమార్, అశోక్, మహేష్ ఏడీవీటీ, శ్రీనివాస్, సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, ప్రశాంత్, ఫొటోగ్రాఫర్ బాబురావు, న్యాయవాది పత్తిరి ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్రాంతి
పండుగ ముందే వచ్చినట్లుగా..
నింగి నుంచి రాలిపడిన చుక్కలను యువతులు,
మహిళలు చేతిలో ఒడిసిపట్టి వాటిని మెల్లమెల్లగా
జారవిడుస్తున్నట్టుగా.. వేసిన రంగవల్లులు భువిపై హరివిల్లును
తలపించాయి. "ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు
ముత్యాల ముగ్గులు, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగుళూరు,
రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన" సహస్ర హైస్కూల్ సౌజన్యంతో
శనివారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ
ఆకట్టుకున్నాయి. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల ఆదర్శనగర్,
వీధి నంబర్ 7లో ఉన్న సహస్ర హైస్కూల్ వేదికగా నిర్వహించిన
ముగ్గుల పోటీలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల
వరకు కొనసాగాయి. సిద్దిపేట పట్టణంతో పాటు జిల్లాలోని
పలు ప్రాంతాల నుంచి మహిళలు
అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రెండవ బహుమతి సాధించిన ముగ్గు - విజేత రేణుక



మూడవ బహుమతి సాధించిన ముగ్గు - విజేత రజిత

### మూలాలను మరచిపోవద్దు

**- స్వాతిరెడ్డి, లీగల్ సెల్ అథారిటీ సిద్దిపేట జిల్లా చైర్‌పర్సన్, సిద్దిపేట సీనియర్ సివిల్ జడ్జి**



తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను, వాటి మూలాలను మహిళలు ఎప్పటికీ మరువకూడదు. మహిళలు ఇంట్లో పనులు చేసుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. నేను లాయర్ అవ్వాలని నిర్ణయించుకున్నప్పుడు బంధువులు, తెలిసిన వారు అడ్డుపడ్డారు. అవేవీ పట్టించుకోకుండా పరీక్ష రాసి రాష్ట్రంలోనే మొట్టమొదటి మహిళా జడ్జిగా ఎంపికయ్యా. జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని గెలవగానే నాడు విమర్శించిన వారే వచ్చి అభినందనలు తెలిపారు. మహిళలుగా లింగభేదం లేకుండా మీరు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. అందుకు పట్టుదలతో రాణించాలి.

### సిద్దిపేటకు ముందే వచ్చిన సంక్రాంతి

**- రోజారాధాకృష్ణశర్మ, జిల్లా జడ్పీ చైర్‌పర్సన్, సిద్దిపేట**



యువతులు, మహిళలు వేసిన అందమైన ముగ్గులను చూస్తుంటే సిద్దిపేటలో సంక్రాంతి ముందే వచ్చినట్లుగా అనిపిస్తున్నది. ముగ్గుల పోటీలలో భాగంగా మహిళలను ఒకేచోట చేర్చిన ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌కు కృతజ్ఞతలు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా యువతులు, మహిళలు అందంగా ముగ్గులు వేశారు. ప్రతీ ముగ్గూ ఎంతో ఆకట్టుకున్నది.

### అందమైన రంగవల్లులు

**- మంజులరాజనర్సు, మున్సిపల్ చైర్‌పర్సన్, సిద్దిపేట**



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పోటీపడి అందమైన రంగవల్లులు వేశారు. సిద్దిపేటలో ఇంత మంచి పండుగ ఏర్పాటు చేసినందుకు ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌కు ధన్యవాదాలు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పోటీలో పాల్గొన్న యువతులు, మహిళలకు ప్రత్యేక అభినందనలు. ముగ్గులు వేయడం ఆ దేవుడు మహిళలకిచ్చిన గొప్ప వరం. ఇక్కడ వేసిన ముగ్గులు చూస్తుంటే ఒక్కో ముగ్గు ఒక్కో ప్రాధాన్యత కలిగి ఉంది.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**- దుర్గ, సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ**



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. పోటీల్లో గెలుపోటములు సహజం. ఓడిపోయినంత మాత్రాన బాధపడకూడదు. మున్ముందు మరింతగా రాణించేలా ప్రతిభను కనబర్చాలి. సమాజంలో తమకు ఎదురవుతున్న సమస్యలను, వేధింపులను మహిళలు నిర్భయంగా మహిళా పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకురావాలి. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను చాటిన మహిళలకు అభినందనలు.



సిద్దిపేటలోని సహస్ర హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో మహిళలు వేసిన ముగ్గులు





పోటీలో ఉత్సాహంగా ముగ్గు వేస్తున్న అవ్వ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సహస్ర హైస్కూల్ చైర్మన్ దరిపల్లి చంద్రం

---



# నేడే మల్లన్న కల్యాణం

- తోటబావివద్ద కల్యాణ వేదిక ఏర్పాట్లు పూర్తి
- శోభాయమానంగా ఆలయ పరిసరాలు
- మూడునెలల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

7లో..

కల్యాణ శోభలో మల్లన్న, కేతలమ్మ, మేడలాదేవి, ముస్తాబైన కల్యాణ వేదిక



# రాష్ట్రవ్యాప్తంగా సజావుగా ప్రజాపాలన

- ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి కొనసాగుతుంది
- అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- హుస్నాబాద్‌లోని హమాలీలకు హెల్త్ ప్రొఫైల్ టెస్టులు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపాలన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 6: డిసెంబరు 28 నుంచి శనివారం వరకు జరిగిన ప్రజాపాలన అభయహస్తం సభలు ఎలాంటి ఆటంకాలూ లేకుండా సజావుగా సాగాయని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాపాలన సభలు ప్రతి నాలుగు నెలలకు ఒకమారు జరుగుతాయని వెల్లడించారు. శనివారం ఆయన హుస్నాబాద్‌లోని మల్లెచెట్టు చౌరస్తా వద్ద జరిగిన ప్రజాపాలన వార్డు సభలో మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం వరకు 85వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే 420 అంటూ ఆరోపణలు చేస్తున్నారని, అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేసిన బీఆర్ఎస్ నేతలపై ఎన్ని కేసులైనా పెట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్ని అప్పులున్నా, ఎన్ని కష్టాలు వచ్చినా ధృఢ సంకల్పంతో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని వెల్లడించారు. ఎమ్మెల్యే పదవి మీరిచ్చిన భిక్ష అని, నియోజకవర్గాల ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన ఎజెండాగా పని చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితులను ఒప్పించి, మెప్పించి వారికి గౌరవం ఇస్తూ దానిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను పూర్తిచేసి సాగు నీరందించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మున్సిపల్‌లోని హమాలీలకు ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ పరీక్షలు చేపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ వంటి ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం వచ్చే ప్రజలకు సహకారం అందించేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించి వైద్య సేవలందిస్తామన్నారు. హుస్నాబాద్ ఆర్టీసీ డిపోను బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో బెన్‌షాలోమ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ రాజశేఖర్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, సరోజన, వల్లపు రాజు, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్ తదితరులున్నారు.

### మంత్రిని కలిసిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హుస్నాబాద్‌లోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు తమ సమస్యలను విన్నవించారు. డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించినప్పటికీ ఇంకా వాటిని అందించలేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇంకా పూర్తి కాలేదని వివరించారు. వాటిని పూర్తి చేసి తమకు అందించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

### హమాలీ సమస్యలు తెలుసుకున్న మంత్రి

మంత్రి పొన్నం ప్రభాకర్ తెల్లవారుజామున పట్టణంలోని 14వ వార్డులో మార్నింగ్ వాక్ చేశారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హమాలీలతో సమావేశమయ్యారు. మీ అందరి కృషి వల్ల ఎమ్మెల్యేగా గెలుపొందానని వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులు ఎప్పటికప్పుడు హెల్త్ ప్రొఫైల్ పరీక్షలు చేసుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేపిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య కర్ణకంటి మంజులరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిత్తారి రవీందర్, అక్కు శ్రీనివాస్, ఎండి హసన్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, చందు తదితరులున్నారు.

### హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలపాలి

హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను పూర్వపు కరీంనగర్ జిల్లాలో కలపాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు బీమాసాహెబ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అప్పటి ప్రభుత్వం అక్రమంగా సిద్దిపేట జిల్లాలో కలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మేరకు తక్షణమే కరీంనగర్ జిల్లాలో కలుపాలని కోరారు. ఇందులో ఆ సంఘ నాయకులు శివరాజ్, శ్రీనివాస్ నాయక్, భాస్కర్ నాయక్, లక్‌పతి, తిరుపతినాయక్ తదితరులున్నారు.

### నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ సబ్సిడీని కొనసాగిస్తాం

అక్కన్నపేట: నాయీ బ్రాహ్మణులకు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే ఉచిత విద్యుత్ సబ్సిడీని కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలిసి నాయీ బ్రాహ్మణుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సెలూన్లు నిర్వహించుకోవడానికి, రజకులు ధోబి ఘాట్ల కోసం గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సబ్సిడీని అందిస్తామన్నారు. ఇందులో నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానాల కిషన్, నాయకులు జంపాల నర్సయ్య, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## కుమారుడి మరణ వార్త విని.. తల్లి మృతి


నర్సింహగౌడ్, లక్ష్మి (ఫైల్)

హవేళిఘణపూర్, జనవరి6: కుమారుడి మృతి తట్టుకోలేక తల్లి గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలోని కూచన్‌పల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వీరప్పగారి నర్సింహగౌడ్(38) భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి నివసిస్తున్నాడు. రోజు మాదిరిగానే నర్సింహగౌడ్ శుక్రవారం నిద్రించాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు లేపగా లేవకపోవడంతో వెంటనే మెదక్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న అతని తల్లి లక్ష్మి(57) అక్కడే కుప్పకూలిపోయింది. పరీక్షించిన వైద్యులు ఆమె గుండెపోటుతో మృతి చెందిందని నిర్ధారించారు. ఒకే రోజు కుమారుడు, తల్లి గుండెపోటుతో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని స్నేహితులు అతని కుటుంబానికి రూ. 25 వేల ఆర్థిక సాయం చేశారు.


## సీఎంఆర్‌ను నిర్ణీత గడువులోగా అందించాలి

● సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి


సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి రూరల్, జనవరి 6: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా అందించాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైస్ మిల్లర్లు పెట్టాల్సిన సీఎంఆర్ దిగుమతిలో ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. వానాకాలం 2023-24 ధాన్యం రవాణాకు సంబంధించి రసీదులను త్వరితగతిన సమర్పిస్తే డబ్బు చెల్లించడం జరుగుతుందని ధాన్యం రవాణా కాంట్రాక్టర్లకు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వనజాత, పౌరసరఫరాల శాఖ డీఎం సుగుణబాయ్, రైస్ మిల్లర్లు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా వెంకటనర్సయ్య



అక్కన్నపేట, జనవరి 6: ఈ నెల 9 నుంచి 12 వరకు కర్ణాటక రాష్ట్రంలోని విజయపురలో జరగనున్న జాతీయ రోడ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల సైక్లింగ్ జట్టుకు మేనేజర్‌గా, అక్కన్నపేట మండలం మల్లంపల్లి ఉన్నత పాఠశాల పీఈటీ జంగపల్లి వెంకటనర్సయ్య ఎంపికైనట్లు శనివారం తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన సైక్లిస్టులు మెరుగైన ప్రతిభ కనబరిచి అత్యధిక పతకాలు సాధించాలని కోరారు. వెంకటనర్సయ్య నియామకం పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి టీ హరీశ్ రావు, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్రీడల యువజన అభివృద్ధి అధికారి నాగేందర్, మల్లంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గూగులోతు రంగా, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా నాయకుడు యాదవరెడ్డి

జహీరాబాద్, జనవరి 6: చెరకు రైతులకు ట్రైడెంట్ యాజామాన్యం పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని రైతుసంఘం జిల్లా నాయకుడు యాదవరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని హోతి(బి) గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రైతులు స్థానికంగా ఉన్న ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని నమ్ముకుని చెరకు పంటను సాగుచేస్తున్నారన్నారు. అన్నీ వాతావరణాలకు చెరకుపంట తట్టుకుంటుందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి పాలకులు, అధికారులు చెరకు రైతుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. చెరకు రైతులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షైపాల్, మల్లారెడ్డి, కిష్టప్ప, లక్ష్మారెడ్డి, జాకీర్, అల్లావుద్దీన్, సురేష్, వెంకటేష్, మోయియోద్దీన్, నరేష్, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల భావప్రకటనా స్వేచ్ఛను కాపాడండి

● ఏపీ పాలకులకు లేఖ రాయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి

మెదక్, జనవరి6, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిగల భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగేవిధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, అక్కడ సభలూ, సమావేశాలూ నిర్వహించుకోవడానికి అనుమతులు ఇచ్చేందుకు ఆ ప్రభుత్వానికి లేఖ రాయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 6న గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మాదిగ విద్యార్థి సమాఖ్య, ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభ జరగాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఎమ్మార్పీఎస్ ఉద్యమం అణిచివేయలేరని వారు హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం తమతీరు మార్చుకోవాలని, తదుపరి రోజుల్లో సభల నిర్వహణకు ముందస్తు అనుమతి కోసం ఆ ప్రభుత్వానికి లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజు, కందారం రాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, పుష్ప మాధవి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.


కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

## బీఆర్ఎస్ పాలనలో
# మల్లన్న ఆలయంలో అంతా అవినీతే



విలేకరులతో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, జనవరి 6 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లన్న ఆలయంలో అవినీతి తాండవమాడిందని, అందినకాడికి దోచుకుని భక్తుల వసతుల కల్పన విస్మరించారని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న కల్యాణం సందర్భంగా శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం తోటబావి ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలయాభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లు తీసుకువస్తానని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు. అందుకే బీఆర్ఎస్ ఓటమి చవిచూసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని, మల్లన్న ఆలయ సమగ్రాభివృద్ధికి పాటుపడతానన్నారు. స్థానిక నేతలు మల్లన్న ఆలయాభివృద్ధి పేరిట కోట్లు దండుకున్నారన్నారు. ప్రస్తుత పునరుద్ధరణ కమిటీ భక్తులకు సేవచేస్తూ అవినీతికి తావివ్వకుండా ఆలయాభివృద్ధికి పారదర్శకంగా పాటుపడి వన్నె తీసుకురావాలని సూచించారు. ఆయనవెంట మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# నేడే కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం

- తోటబావివద్ద కల్యాణవేదిక ఏర్పాట్లు పూర్తి
- శోభాయమానంగా ఆలయ పరిసరాలు

చేర్యాల, జనవరి 6: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జునస్వామి పెండ్లికొడుకయ్యాడు. వీరశైవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవీ, యాదవుల ఆడబిడ్డ అయిన కేతలాదేవీని వివాహమాడేందుకు సిద్ధమయ్యాడు. ఉజ్జయిని సధర్మ సింహాసనాదీశ్వర వీరశైవ పీఠాధిపతి సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య మహాస్వామి వేద పర్యవేక్షణలో కల్యాణం జరుపుతారు. కల్యాణంతో మూడునెలలపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. ఈమేరకు తోటబావి ప్రాంగణంలోని కల్యాణమండపంలో వెండిసింహాసనంపై మనువాడనున్నారు. ఆలయవర్గాలు, ప్రభుత్వశాఖల అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. తోటబావి ప్రాంగణాన్ని గ్యాలరీలుగా విభజించి షామియానా, అరటిచెట్లు, మామిడి తోరణాలతో తీర్చిదిద్దారు. కల్యాణ వేదికను పూలతో అలంకరించారు. ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50వేలమంది భక్తులు హాజరుకానుండడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

### నేటి నుంచి మల్లన్న గర్భాలయ దర్శనం

మూలవిరాటు అలంకరణ నిమిత్తం ఆరురోజుల క్రితం నిలిపివేసిన గర్భాలయ దర్శనం నేటి నుంచి పునఃప్రారంభం కానుంది. ఆదివారం తెల్లవారుజామున ముఖమండపంలోని భైరవ విగ్రహం ఎదుట బలిహారణ జరిపి దృష్టికుంభం నిర్వహించనున్నారు. గుమ్మడికాయను బలి ఇచ్చి స్వామివారికి మూడో నేత్రమైన చిత్రకన్నును అమరుస్తారు. అనంతరం పూజలు జరిపి కల్యాణ వేడుకలను ప్రారంభించనున్నారు. తోటబావి వద్ద ఉత్సవ విగ్రహాలతో కల్యాణం నిర్వహిస్తున్న క్రమంలో గర్భాలయంలోనూ మల్లన్నకు శాస్త్రోక్తంగా కల్యాణం జరుపుతారు.



గ్రామంలో బియ్యం సేకరిస్తున్న వీరశైవార్చక కుటుంబసభ్యులు

### బియ్యం సేకరణ

దృష్టికుంభం నిర్వహణకు శనివారం రాత్రి గ్రామంలో వీరశైవార్చకులు వీరభద్రుడి పల్లెరాన్ని చేతపట్టుకుని అర్చకుల ఇళ్ల నుంచి బియ్యాన్ని సేకరించారు. అనంతరం గ్రామంలోని అన్నికుల సంఘాలతో పాటు గ్రామస్థులు బియ్యాన్ని అందించారు. కాగా గతేడాది కల్యాణంలో మల్లన్నకు బంగారు కిరీటం, కోరమీసాన్ని ధరింపజేశారు, ఈఏడాది అమ్మవార్లకు కూడా బంగారు కిరీటాలు చేయిస్తామని ప్రకటించినా, దేవాదాయశాఖాధికారులు అమలు చేయకపోవడం గమనార్హం.

> **కల్యాణానికి ఏర్పాట్లు పూర్తిచేశాం**
>
> మల్లన్న కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాం. ఎలాంటి సమస్యలు ఎదురవకుండా చర్యలు తీసుకున్నాం. ప్రతీ భక్తుడు దివ్యానుభూతికి లోనయ్యేలా కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రసాదాన్ని భక్తులకు అందుబాటులో ఉంచాం. కల్యాణం అనంతరం స్వామివారి శకటోత్సవం ఘనంగా జరిపేలా చర్యలు తీసుకున్నాం.
>
> -ఈవో బాలాజీశర్మ

### పునరుద్ధరణ కమిటీసభ్యులకు అభినందన

మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులుగా 20మంది నియామకమైన నేపథ్యంలో శనివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారిని అభినందించారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం పాలకమండలి కార్యాలయంలో సమావేశమై పర్పాటకం లక్ష్మారెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆలయాధికారులు మర్యాదపూర్వకంగా సత్కరించారు.

### కల్యాణ విధులను అదృష్టంగా భావించాలి

కొమురవెల్లి మల్లన్న కల్యాణం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు విధులు నిర్వర్తించడం అదృష్టంగా భావించాలని, భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని సిద్దిపేట అడిషనల్ అడ్మిన్ డీసీపీ అందె శ్రీనివాసరావు అన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ తోటబావి ప్రాంగణంలో శనివారం జిల్లాస్థాయి పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి విధుల నిర్వహణపై సూచనలు చేశారు. అడిషనల్ డీసీపీలు-2, ఏసీపీ-3, సీఐలు-12, ఎస్ఐలు18మందితో పాటు ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డుల, యాక్సెక్ కంట్రోల్, రోప్ పార్టీ సిబ్బందితో కలిపి మొత్తం 300మందితో పటిష్ఠందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# ఒక్కొక్క చుక్కేసి.. రంగుల ముగ్గేసి..

- సందడిగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు
- పెద్దసంఖ్యలో హాజరైన మహిళలు, యువతులు



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరులో నిర్వహించిన పోటీలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



గూడూరులో ముగ్గు వేస్తున్న మహిళలు



గురుదత్త చారిటబుల్‌ట్రస్టు ప్రతినిధిని సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధులు







గూడూరులో నిర్వహించిన మెదక్ జిల్లాస్థాయి పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్, తదితరులు





సిద్దిపేటలో నిర్వహించిన ముగ్గుల పోటీలో మొదటి బహుమతి అందుకుంటున్న లత, మూడో బహుమతి అందుకుంటున్న రజిత



ముగ్గుల పోటీలో రెండో బహుమతి అందుకుంటున్న రేణుక



ముగ్గుల పోటీకి హాజరైన మహిళలు





సిద్దిపేటలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

# ముగిసిన గడువు.. ప్రారంభమైన ఆన్‌లైన్ ప్రక్రియ



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి మల్లన్నసాగర్ కాలనీలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న గరిమా అగ్రవాల్



అక్కన్నపేటలో అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీవో బెన్‌షాలోమ్



మద్దూరు: ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో



అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో దరఖాస్తులను తీసుకుంటున్న తహసీల్దార్

**గత నెల 28న ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమం శనివారం సాయంత్రం వరకు కొనసాగగా జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాపాలన కౌంటర్లను సందర్శిస్తూ సిబ్బందికి, ప్రజలకు అవసరమైన సూచనలు చేస్తూ సందేహాలను నివృత్తి చేశారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియడంతో డాటాఎంట్రీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు జిల్లా ఉన్నతాధికారులు శనివారం ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు లేకుండా, త్వరితగతిన సమాచారాన్ని ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు.**

గజ్వేల్, జనవరి 6: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మలన్నసాగర్ పునరావాస కాలనీలోని సింగారం, ఎర్రవల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పరిశీలించారు. డాటా ఎంట్రీని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వారితో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఎంపీడీవో మచ్చేందర్, తహసీల్దారు బాల్‌రాజు, ఆర్‌ఐ కృష్ణ, ఏఈవో గణేశ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### తప్పులు దొర్లకుండా చూడాలి: ఆర్డీవో

అక్కన్నపేట, జనవరి 6: ప్రజాపాలనలో వచ్చిన ప్రతీ ఒక్క దరఖాస్తును తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలోమ్ కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. శనివారం అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేస్తున్న ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తుల్లో నింపిన అంశాలను జాగ్రత్తగా ఆన్‌లైన్ చెయ్యాలని, ఏవైనా సమస్యలు ఉంటే ఎంపీడీవో, తహసీల్దార్‌ను సంప్రదించాలని చెప్పారు. ఇందులో మండల పరిషత్ సూపరింటెండెంట్ శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా శనివారం మండలంలోని గౌరవెల్లి, గండిపల్లి, రామవరం, పోతారం(జే) గ్రామాల్లో శనివారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు దరఖాస్తులను పూర్తి చేసి అధికారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మాలోతు లక్ష్మి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో కొప్పుల సత్యపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

### హుస్నాబాద్‌లో 6,918 దరఖాస్తులు

హుస్నాబాద్, జనవరి 6: హుస్నాబాద్ పట్టణంలో ప్రజాపాలన అభయ హస్తం వార్డు సభల్లో శనివారం వరకు మొత్తం 6919 దరఖాస్తులు వచ్చాయి. శనివారం చివరి రోజు 532 దరఖాస్తులు వచ్చాయి. పలు వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ రాజశేఖర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### మద్దూరులో ప్రారంభమైన ఆన్‌లైన్

మద్దూరు, జనవరి 6: ప్రజాపాలనలో భాగంగా గ్రామపంచాయతీలలో చేపట్టిన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు శనివారం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. మద్దూరు మండలంలోని 12 గ్రామాల్లో 7689, దూళిమిట్ట మండలంలో 11 గ్రామాల్లో 4883 చొప్పున మొత్తం 12572 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గ్రామాల వారిగా పంచాయతీ సెక్రటరీలకు, ఆపరేటర్లకు బాధ్యతలు అప్పగించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు అనంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ పరశురాములు ఉన్నారు.

### నేడు అష్టాదశ శక్తిపీఠ ఆలయంలో శివ కల్యాణం

కొండపాక, జనవరి 6: కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర గణపతి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ధ్వజ శిఖర మండల పూజా మహోత్సవాలను ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పంచసూక్త హోమములు, మూల మంత్ర హోమములు, బలిహరణ పూర్ణాహుతి, స్వామి వారి ఎదుర్కోలు మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ మహోత్సవం జరుగుతాయన్నారు.

### 12న పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయండి

హుస్నాబాద్, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ కోరారు. శనివారం ఆయన హుస్నాబాద్‌లో పార్లమెంట్ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ విద్య కాషాయికరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణకు కుట్రలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వేల్పుల ప్రసన్నకుమార్, సయ్యద్ సర్దార్, మాలోతు సాయి, నేర్నాల రాహుల్, వినయ్ పాల్గొన్నారు.

### ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం



నాగిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ జెండా కార్యక్రమం

ములుగు, జనవరి 6: ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు గుంగిశెట్టి శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. శనివారం ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెండా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మాజీ సర్పంచులు భూపాల్‌రెడ్డి, నహిముద్దీన్, రాములు, ముత్యాలు, నర్సింలు, ఎల్లం పాల్గొన్నారు.

### డాకూరు ఆలయంలో విగ్రహాల చోరీ

జోగిపేట, జనవరి 6: డాకూరు ఆలయంలో విగ్రహాల చోరీ విషయం శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. జోగిపేట ఎస్ఐ అరుణ్, ఆలయ పూజారి తెలిపిన వివరాల ప్రకారం.. డాకూరు శివారులోని పురాతన చెన్నకేశవ స్వామి ఆలయంలో గత సోమవారం చోరీ జరిగింది. శనివారం ఉదయం గ్రామ శివారులోని మాలకుంట కాలువలో శివుడి విగ్రహాలు గ్రామస్థుల కంటపడ్డాయి. ఈ విషయాన్ని సర్పంచ్‌తో పాటు పోలీసులకు గ్రామస్థులు సమాచారమందించారు. ఎస్ఐ అరుణ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలోకి వెళ్లి చూడగా, విగ్రహాలతో పాటు 30 తులాల వెండి వస్తువులు, ఆభరణాలు కూడా చోరీకి గురైనట్లు గుర్తించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అరుణ్ తెలిపారు.

### ఏడుపాయల చెక్‌డ్యాంలో మృతదేహం లభ్యం

పాపన్నపేట, జనవరి 6: ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఏడుపాయల చెక్‌డ్యాంలో మృతదేహం ఉన్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుడి వయస్సు 30-35 సంవత్సరాలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గ్రామాల్లో ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ





వర్గల్ మండలంలోని గౌరారం, కొండపాక మండలంలోని జప్తినాచారంలో అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

వర్గల్, జనవరి 6: వర్గల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గౌరారంలో శనివారం అయోధ్య రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రామభక్త బృందం ఇంటింటికీ తిరుగుతూ రాములోరి అంక్షింతలను పంపిణీ చేశారు. వర్గల్ మండల కేంద్రంలో గీతా జ్ఞానమండలి సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా బయలుదేరి ఇంటింటికీ తిరుగుతూ రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు. అలాగే గౌరారంలో శ్రీరామ భక్త బృందం, గీతాభక్త మండల, బీజేపీ నాయకులు అయోధ్య అక్షింతలతో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, బద్రినాథ్, మైపాల్ యాదవ్ పాల్గొన్నారు.

● కొండపాక: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని పలు గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించడంతో పాటు ఇంటింటికీ అందజేశారు. మండలంలోని జప్తినాచారం, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో ఆలయాల్లో అయోధ్య అక్షింతల కలశాలకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ అందజేశారు.

## ప్రతీ ఎకరాకు సాగునీరందించాలి: దుబ్బాక ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 6: దుబ్బాక నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందించాలని, పెండింగ్‌లో ఉన్న కాలువల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలతో కలిసి నీటి పారుదల, రెవెన్యూ అధికారులతో మల్లన్నసాగర్, ఉప్పరపల్లి, రామాయంపేట సాగునీటి ప్రధాన కాలువలకు సంబంధించిన కాలువల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన కాలువల నిర్మాణం జరిగినప్పటికీ చిన్న కాలువలు పూర్తి చేస్తేనే నియోజకవర్గంలో 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గతంలో ఎన్ని కాలువలకు భూసేకరణ చేశారని, ఎన్ని కాలువల నిర్మాణం చేపట్టారని, కొత్తగా చేపట్టాల్సిన కాలువల నిర్మాణం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నెలాఖరులోగా కాలువలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలన్నారు. రైతులు కూడా పూర్తిస్థాయిలో సహకారాన్ని అందించాలని, త్వరలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మల్లన్నసాగర్ ఎస్ఈ వేణు, ఆర్డీవో రమేష్ బాబు, ఈఈ సాయిబాబా, డీఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 'డబుల్' జాబితాలో అనర్హులను తొలగించండి



గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం సాధన కమిటీ సభ్యులు

గజ్వేల్, జనవరి 6: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఇళ్ల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో అనర్హులను తొలగించి, అర్హులకు ఇళ్లను ఇవ్వాలని డబుల్ బెడ్‌రూం సాధనకమిటీ కన్వీనర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య కోరారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని శనివారం వారి ఇంట్లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ సొంత ఇల్లు, ఆస్తులు ఉన్న వారికి డబుల్ బెడ్‌రూంను కేటాయించారని, 30 ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటున్నవారికి ఇళ్లు రాకపోవడం దారుణమన్నారు. మహిళలు, ఆటోడ్రైవర్లు, కూలీ చేసుకుని బతికే వారే అధికరంగా ఉన్నారని, ఒంటరి మహిళలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. సమగ్రంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను నిర్వహించి, అర్హులైన వారికి అందజేయాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2,300మందికి పట్టాలు ఇచ్చిందని, కలెక్టర్‌తో చర్చించి ఇళ్లు లేని పేదలకు న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. వారితో నాయకులు నాయిని యాదగిరి, డబుల్ బెడ్‌రూం సాధన కమిటీ నాయకులు నర్సింహులు, పద్మ, కవిత, అనిత, లక్ష్మి, మహేందర్, శివ, సంపత్, యాదగిరి, సత్తయ్య ఉన్నారు.



మృతురాలు రాధ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రఘునందన్‌రావు

### మృతుల కుటుంబాలకు మాజీఎమ్మెల్యే పరామర్శ

దుబ్బాక, జనవరి 6: మండలంలోని హబ్షీపూర్, దుబ్బాక పట్టణంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను శనివారం దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పరామర్శించారు. దుబ్బాక పట్టణానికి చెందిన జగ్గారి నాగరాజు తల్లి రాధ, బోల్లం కాశాగౌడ్‌లు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు తదితరులున్నారు.



ఎంపీటీసీ బానోతు ప్రమీలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### కాంగ్రెస్ పార్టీలో చేరిన గండిపల్లి ఎంపీటీసీ

అక్కన్నపేట, జనవరి 6: అక్కన్నపేట మండలం గండిపల్లి బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ బానోతు ప్రమీల సోమునాయక్ తన అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు.

### లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలి



అంగడి కిష్టాపూర్‌లో డ్రాగన్ తోటను పరిశీలిస్తున్న ఏవో

జగదేవ్‌పూర్ జనవరి 6: రైతులు కేవలం సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలనే కాకుండా అధిక లాభాలు వచ్చే డ్రాగన్ ఫ్రూట్, ఎండు మిరప, బొప్పాయి, స్వీట్ కార్న్, పందిరి కూరగాయాలను సాగు చేయాలని మర్కుక్ మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంగడి కిష్టాపూర్‌లో డ్రాగన్ పంటసాగును పరిశీలించారు. ఎత్తయిన బెడ్స్ వేసుకొని మల్చింగ్ షీటు, డ్రిప్ ద్వారా సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణువర్ధన్ ఉన్నారు.

### లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి ఇవ్వాలి

● ఆర్డీవోకు బీజేపీ నాయకుల వినతి

హుస్నాబాద్, జనవరి 6: హుస్నాబాద్ పట్టణంలో పలువురు లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలని శనివారం బీజేపీ నాయకులు ఆర్డీవో బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అసంపూర్తిగా నిర్మాణం చేసి లబ్ధిదారులకు ఇచ్చిందని, దీంతో వారు ఆ ఇళ్లలో నివసించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, నాయకులు తగరపు లక్ష్మణ్, రాంప్రసాద్, వేల్పుల నాగార్జున, వెంకటేశ్, పచ్చిమట్ల శ్రీధర్, అశోక్ తదితరులున్నారు.

### వర్క్‌సైట్ పాఠశాలలను ఏర్పాటు చేయాలి

గజ్వేల్ టౌన్, జనవరి 6: పొట్టకూటి కోసం వలస వచ్చిన కూలీల పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో శనివారం వలస కార్మికుల కుటుంబాలను ఏగొండ స్వామి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ భవన నిర్మాణానికి, మెడికల్ భవన నిర్మాణానికి, గజ్వేల్, దుబ్బాక డివిజన్ పరిధిలో కాటన్ జిన్నింగ్ మిల్లుల వద్ద, నూతన వెంచర్లు, పౌల్ట్రీఫాంలు, ఇటుక బట్టీల వదంద అధికారిక లెక్కల ప్రకారం 17 వర్క్ సైట్‌లలో దాదాపు 480 మంది పిల్లలను గుర్తించినట్లు వివరించారు. వలస కార్మికుల పని ప్రదేశంలో వర్క్ సైట్ పాఠశాలలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## సిద్దిపేట మున్సిపల్ చైర్మన్‌పై 'అవిశ్వాసం' అవాస్తవం

● అవినీతిపై చర్చకు సిద్ధమా?

● కాంగ్రెస్ నాయకులకు మున్సిపల్ కౌన్సిల్ సవాల్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లు

సిద్దిపేట క్రైం, జనవరి 6: సిద్దిపేట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతున్నట్లు మీడియా ద్వారా కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం అవాస్తవమని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు భారత్‌నగర్‌లోని నివాసంలో శనివారం వారు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కల్సి మాట్లాడారు. మా మున్సిపల్ కౌన్సిల్‌కు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే అవసరం లేదని చెప్పారు. అవిశ్వాసం పెడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టు వారు ఆరోపించారు. కొంతమంది కౌన్సిలర్లు డిసెంబరు 31 వేడుకల కోసం హైదరాబాద్ వెళ్తే అవిశ్వాస తీర్మానంపై చర్చ అని దుష్ప్రచారం చేశారన్నారు. ఇటీవల హరీశ్‌రావుకి శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్లిన క్రమంలో అదేరోజు సాయంత్రం వారు వ్యక్తి గతంగా పార్టీ చేసుకున్నారు. దానిపై కొన్ని పత్రికల్లో అవాస్తవమైన కథనాలు వచ్చాయన్నారు. మాతో 20మంది టచ్‌లో ఉన్నారంటూ నిన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతూ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడతామని మీడియా ద్వారా చేసిన ఆరోపణలు వాస్తవం కాదని వారు వెల్లడించారు. నిజాయితీగా ఉన్నందువల్లే గత మూడుమార్లు చైర్మన్‌గా కొనసాగుతున్నారని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. అవినీతి ఆరోపణలపై చర్చకు సిద్ధమని వారు సవాల్ విసిరారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి సమానంగా జరిగిందని, ఒకవేళ అవినీతి జరిగితే అవార్డులు ఎందుకు వస్తాయని, సిద్దిపేట మోడల్‌గా ఎందుకు నిలుస్తుందని ప్రశ్నించారు. దమ్ముంటే అవినీతి నిరూపించాలని లేని పక్షంలో జైలుకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయకులకు మున్సిపల్ వైస్ చైర్మన్ సవాల్ విసిరారు. శుక్రవారం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సమష్టి కృషికి నిదర్శనమని మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన మాజీమంత్రి హరీశ్‌రావుతో పాటు భాగస్వామ్యం అయిన పట్టణ ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో కౌన్సిలర్లు బర్మం, ప్రవీణ్, నాయకం లక్ష్మణ్, గ్యాదరి రవీందర్, సుందర్, డా. విరోఛ, సద్ది నాగరాజు, నాయిని చంద్రం, తాడూరి సాయిశ్వర్, వడ్ల కొండ సాయి,ఎడ్ల అరవింద్‌రెడ్డి, రెడ్డి విజేందర్‌రెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్, యోగి, పస్కుల సతీష్, అనగోని వినోద్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు మేర సత్తయ్య, సైయిద్ నాయకులు అత్తర్ పటేల్, వరాల సురేష్, వజీర్, పయ్యావుల ఎల్లం యాదవ్, బందారం రాజు, బింగి రాజేశమ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, మోహిజ్, వంగ తిరుమల్‌రెడ్డి, కాటం రఘురామ్, అలకుంట మహేందర్, భూంపల్లి శ్రీహరి, పాతురి శ్రీనివాస్ రెడ్డి, ఉదర మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## బినామీ పేర్లతో డబుల్ బెడ్‌రూమ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, జనవరి 6: మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన అనుచరులు కలిసి సిద్దిపేటలో డబుల్ బెడ్‌రూమ్‌లను స్వాహా చేశారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ ఆరోపించారు. శనివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో సిద్దిపేట పట్టణంలో ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేద ప్రజలకు పంపిణీ చేయకుండా బినామీల పేరు మీద సుమారు 650కు పైగా ఇళ్లను స్వాహా చేశారన్నారన్నారు. అంతే కాకుండా 200 కు పైగా డబుల్ బెడ్‌రూంలను ఇంతకాలం పంపిణీ చేయకుండా నిరుపయోగంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు ఉంచారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేద ప్రజలకు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ యాదవ్, పరుశురాం, గణేష్, ప్రశాంత్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటికీ కాషాయజెండాల పంపిణీ



గజ్వేల్ వేంకటేశ్వరాలయంలో ఇంటింటికీ కాషాయజెండాల పంపిణీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జనవరి 6: ఇంటింటికీ కాషాయ జెండాల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరాలయ అధ్యక్షుడు బుక్క రమేశ్‌గుప్తా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వెంకటేశ్వరాలయంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జడ్పీటీసీ పంగ మల్లేశం, పూజారులు శేషం శ్రీనివాసాచార్యులు, నందబాలశర్మ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటింటికీ కాషాయ జెండాలను పంపిణీ చేయాలని వేంకటేశ్వరాలయ అధ్యక్షుడు బుక్క రమేశ్ సంకల్పించడాన్ని అభినందించారు. ప్రతీ హిందువు ఇంటిపై కాషాయజెండా ఎగురవేయాలని ఈ సందర్భంగా పూజారులు తెలిపారు. అయోధ్య అక్షింతలు ఇంట్లో శుభకార్యాలకు వినియోగించుకోవాలని, రామమందిరం ప్రారంభం రోజున ఇంట్లో ఐదు దీపాలను వెలిగించుకుని, ప్రతీ ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలను నిర్వహించాలన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



భూంపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైనా విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న మౌళిక వసతులను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

### టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



దుబ్బాకలో టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

దుబ్బాక/మిరుదొడ్డి, జనవరి 6: దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో శనివారం టీపీటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా కార్యదర్శులు మల్లేశం, శివాజీ, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు తదితరులున్నారు.

### చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలు



ఆసుపత్రిలో నర్సింహులును పరామర్శిస్తున్న గౌడ సంఘం నాయకులు

మద్దూరు, జనవరి 6: తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడిన గీతకార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వగలబోయిన నర్సింహులు తాటి చెట్టు ఎక్కి కల్లుగీసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, చేర్యాల పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు అంబాల బుచ్చిరాములు, డైరెక్టర్ బొంగోని భాస్కర్, గుడాల గణేష్, ఆముదాల రంజిత్, శ్రీనివాస్, శేఖర్, మల్లయ్య తదితరులు నర్సింహులును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రభుత్వం నర్సింహులు వైద్యానికి అయ్యే ఖర్చులు భరించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### రాజకీయ కక్షతోనే మాపై కేసులు

గజ్వేల్, జనవరి 6: రాజకీయ కక్షతోనే మాపై కేసులు నమోదు చేస్తున్నారని గజ్వేల్ పట్టణానికి చెందిన గంగుమల్ల శ్రీనివాస్‌రెడ్డి, గుంటుకు రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హైకోర్టు గెజిట్ నోటిఫికేషన్ నెంబర్ 46ఏని 2016లో రద్దు చేశారని, రద్దు చేసిన నోటిఫికేషన్‌తో మాపై కేసు పెట్టే అధికారం మహ్మద్ అబ్దుల్ వహీద్‌కు లేదన్నారు. ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేస్తున్నామని, తప్పుడు కేసు పెట్టిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, పరువు నష్టం దావా వేస్తామన్నారు.

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రాజు

ములుగు, జనవరి 6: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన తూర్పుంటి రాజును ప్రచార కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. ప్రచార కార్యదర్శిగా కుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.